epaper : tmedia.net.in

GSTIN-NO:36FDKPS1308P1ZX , Regd. No. 100/20

టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

MEDIA

మెయిన్ : మంగవారం - అక్టోబర్ 03-2023 పేజీలు : 3

నేడు తెలంగాణలో అమిత్ షా పర్యటన



టీ మీడియా, అక్టోబర్ 9, న్యూఢిల్లీ :

కేంద్ర హోంమంత్రి అమిత్ షా రేపు తెలంగాణలో పర్యటించనున్నారు. బీజేపీ అగ్రనేతలు వరుసగా తెలంగాణ పర్యటనకు వస్తున్నారు. మొన్న ప్రధాని నరేంద్ర మోడీ రెండు రోజుల పాటు.. తెలంగాణ రాష్ట్రంలో పర్యటించారు. ఇక ఇప్పుడు కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం తెలంగాణ రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆదిలాబాద్ లో నిర్వహించనున్న జనగర్జన సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొంటారు. ఎన్నికల షెడ్యూల్ తర్వాత అమిత్ షా తెలంగాణలో మొదటి సారి పర్యటించనున్నారు. అనంతరం హైదరాబాద్ లో మేధావులతో సమావేశం కానున్నారు. బీజేపీ ముఖ్య నేతలతో అమిత్ షా సమావేశం కానున్నారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై చర్చించే అవకాశముంది. ఎన్నికల వ్యూహాలపై అమిత్ షా దిశానిర్దేశం చేయనున్నారు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కుల గణన నిర్వహిస్తాం

- రాహుల్ గాంధీ

టీ మీడియా, అక్టోబర్ 9, న్యూఢిల్లీ :

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు ఆయా రాష్ట్రాల్లో కుల గణన చేపట్టేందుకు చర్యలు చేపడతారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వెల్లడించారు. కుల గణనకు అనుకూలంగా తాము చారిత్రక నిర్ణయం తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. రాహుల్ సోమవారం సీడబ్ల్యూసీ సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ వివరాలు వెల్లడించారు. వర్కింగ్ కమిటీ భేటీలో తాము కుల గణనపై విస్తతంగా చర్చించామని, ప్రతి ఒక్కరూ దీనికి మద్దతిచ్చారని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు కుల గణన సర్వేలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ సమావేశంలో రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియా గాంధీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కుల గణనతో పాటు త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు సహా పలు అంశాలపై సంప్రదింపులు జరిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి అవసరమైన వ్యూహాలపై చర్చించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ కుల గణనకు అనుకూలంగా ఉందని, రాజస్థాన్‌లో ఈ దిశగా ప్రక్రియ మొదలైందని కాంగ్రెస్ నేత భన్వర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ఇక సీడబ్ల్యూసీ సమావేశంలో రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, కర్నాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల సీఎంలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల సీఎల్పీ నేతలు పాల్గొన్నారు.

ఐదు రాష్ట్రాల

ఎన్నికల షెడ్యూల్ విడుదల

తెలంగాణలో నవంబర్ 30న పోలింగ్

డిసెంబర్ 3న కౌంటింగ్

టీ మీడియా, అక్టోబర్ 9, న్యూఢిల్లీ :

తెలంగాణలో పాటు నాలుగు రాష్ట్రాలకు ఎన్నికల నగారా మోగింది. తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరాం రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో ఈ ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ సందర్భంగా సీఈసీ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేస్తున్నాం. 40 రోజుల్లో ఐదు రాష్ట్రాల్లో పర్యటించాం. ఐదు రాష్ట్రాల అధికారులు, పార్టీల నేతలతో చర్చలు జరిపాం. వివిధ రాజకీయ పార్టీల నుంచి అభిప్రాయాలు తీసుకున్నాం. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం ఆరు నెలలుగా కసరత్తు చేస్తున్నాం అని తెలిపారు. తెలంగాణలో 119, ఛత్తీస్‌గఢ్‌లో 90, మిజోరాంలో 40, రాజస్థాన్‌లో 200, మధ్యప్రదేశ్‌లో 230 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు సీఈసీ పేర్కొన్నారు. మొత్తంలో ఐదు రాష్ట్రాల్లో 679 శాసనసభ స్థానాలున్నాయని తెలిపారు. మిజోరాం శాసనసభ పదవీకాలం డిసెంబర్ 17, ఛత్తీస్‌గఢ్ జనవరి 3, మధ్యప్రదేశ్ జనవరి 8, రాజస్థాన్ జనవరి 14, తెలంగాణ శాసనసభ పదవీకాలం జనవరి 18 ముగియనున్నట్లు పేర్కొన్నారు. ఐదు రాష్ట్రాల్లో 8.2 కోట్ల మంది పురుష ఓటర్లు, 7.8 కోట్ల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇందులో 60.2 లక్షల మంది తొలిసారిగా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తెలంగాణలో ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర శాసనసభకు నవంబర్ 30వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు.

తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరాం రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో ఈ ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి నవంబర్ 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు సీఈసీ రాజీవ్ కుమార్ వెల్లడించారు. నవంబర్ 10వ తేదీ నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. 13న స్క్రూట్నీ నిర్వహించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ నవంబర్ 15. నవంబర్ 30వ తేదీన ఎన్నికలు నిర్వహించి, డిసెంబర్ 3న కౌంటింగ్ చేయనున్నారు. తెలంగాణలోని 119 నియోజకవర్గాలకు ఒకే విడుతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాజీవ్ కుమార్ పేర్కొన్నారు.

15న బీఆర్ఎస్ అభ్యర్థులతో కేసీఆర్ భేటీ

- అదేరోజు మేనిఫెస్టో ప్రకటన
- నవంబర్ 9న నామినేషన్లు

టీ మీడియా, అక్టోబర్ 9, హైదరాబాద్ :

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఈ నెల 15న భారత రాష్ట్ర సమితి అభ్యర్థులతో సమావేశంకానున్నారు. తెలంగాణ భవన్‌లో జరిగే సమావేశంలో అభ్యర్థులకు బీ ఫారాలను అందజేయనున్నారు. ఇక అదేరోజున పార్టీ ఎన్నికల మేనిఫె స్టోను ప్రకటించనున్నారు. అదే రోజు నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. 15న సాయంత్రం హైదరాబాద్ నుంచి బయలుదేరి.. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. 16న జనగామ, భువనగిరి నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే బహిరంగ సభలకు హాజరవుతారు. 17న సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాల్లో జరిగే సభలకు హాజరవుతారు. 18న మధ్యాహ్నం 2 గంటలకు జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలో జరిగే మీటింగ్‌లో, సాయంత్రం 4 గంటలకు మేడ్చల్‌లో జరిగే సభకు హాజరై ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ గజ్వేల్, కామారెడ్డిలో ముఖ్యమంత్రి కేసీఆర్ నామినేషన్ వేయడానికి ముహూర్తం ఖరారు చేసుకున్నారు. నవంబర్ 9న రెండు నియోజక వర్గాల్లో నామినేషన్ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు.. కేసీఆర్ జిల్లాల్లో పర్యటించనున్నారు.నవంబరు 9న సిద్దిపేట నియోజకవర్గంలోని కోనాయపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లి ఆనవాయితీ ప్రకారం ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. ఆ తర్వాత గజ్వేల్ లో నామినేషన్ వేస్తారు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు కామారెడ్డిలో నామినేషన్ వేస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమయ్యే కామారెడ్డి బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొంటారు.

హోరాహోరీగా సూర్యాపేటపోరు

- సంస్థాగతంగా కాంగ్రెస్ కు బలం
- కేసీఆర్‌కు సన్నిహితుడైన మంత్రి జగదీశ్‌రెడ్డి

టి మీడియా, అక్టోబర్ 9, సూర్యాపేట :

సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం సూర్యాపేట.. సంస్థాగతంగా కాంగ్రెస్ బలంగా ఉన్న సూర్యాపేటలో వరుసగా రెండుసార్లు బొటాబొటి మెజార్టీతో గట్టెక్కారు మంత్రి జగదీశ్‌రెడ్డి.. మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలనుకుంటున్న జగదీశ్‌రెడ్డికి పార్టీలో అంతర్గత సమస్యలు సవాల్గా మారుతున్నాయి.. అటు కాంగ్రెస్‌లోనూ ఇంచుమించు ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈ సారి సూర్యాపేటలో ఎగిరేది ఏ జెండా? బీఆర్ఎస్ మరోసారి జోరు చూపనుందా? కాంగ్రెస్ తలరాత మారుతుందా? బీజేపీ ప్రభావం చూపుబోతుందా..? రానున్న ఎన్నికల్లో సూర్యాపేటలో కనిపించబోయే సీనేంటి?రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వారిధిగా నిలుస్తోంది సూర్యాపేట నియోజకవర్గం.. హైదరాబాద్-విజయవాడ హైవేపై ఉన్న సూర్యాపేట పట్టణం అభివద్ధిలో దూసుకుపోతోంది. జిల్లా కేంద్రంగా అప్‌గ్రేడ్ అయిన తర్వాత సూర్యాపేట రూపురేఖలే మారిపోయాయి. ఒకప్పుడు తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రధాన కేంద్రంగా ఉన్న సూర్యాపేట నుండి ఎందరో ప్రముఖ నేతలు ఎమ్మెల్యేలుగా పనిచేశారు. 1952లో సూర్యాపేట నియోజకవర్గం ఏర్పాటు కాగా.. ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. మొదటి నాలుగు సార్లు వామపక్ష పార్టీ నేతలు ఎమ్మెల్యేలుగా గెలిస్తే.. ఆ తర్వాత ఐదు సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ గెలుపొందాయి. గత రెండుసార్లు వరుసగా బీఆర్ఎస్ విజయం సాధించింది.ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా ఉన్న సూర్యాపేట.. 2009లో పునర్విభజన తర్వాత జనరల్‌గా మారింది. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ నేత రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాష్ట్ర విభజన తర్వాత 2014 నుండి బీఆర్ఎస్ హవా మొదలైంది. 2014, 2018 ఎన్నికల్లో వరుసగా మంత్రి జగదీశ్‌రెడ్డి సూర్యాపేట ఎమ్మెల్యేగా గెలిచారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలు ఉండగా, మొత్తం 2 లక్షల 35 వేల 323 మంది ఓటర్లు నమోదయ్యారు. గత రెండు ఎన్నికల్లోనూ మంత్రి స్వల్ప మెజార్టీతోనే గెలిచారు. 2014లో కేవలం రెండు వేల రెండు వందల ఓట్లు, గత ఎన్నికల్లో ఐదు వేల 9 వందల ఓట్ల ఆధిక్యంతో గెలిచారు జగదీశ్‌రెడ్డి. మంత్రి ప్రధాన అనుచరుడిగా ఉన్న వ్యక్తి ఆగడాలపై ఇటీవల కాలంలో ఫిర్యాదులు పెరిగిపోవడం బీఆర్ఎస్‌కు ప్రతికూలంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఫిర్యాదులతో అతడిని మంత్రి దూరం పెట్టగా.. అతను జగదీశ్ రెడ్డికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్నారు. దీంతో బీసీ నేతలను మంత్రి తొక్కేస్తున్నారనే విమర్శలను ఎదుర్కొంటున్నారు. ఏదేమైనా తాను చేసిన అభివద్ధే మళ్లీ గెలిపిస్తుందని నమ్మకంగా చెబుతున్నారు మంత్రి.మొదట్లో కమ్యూనిస్టుల ప్రభావం ఎక్కువగా ఉన్న సూర్యాపేటలో రానురాను కాంగ్రెస్ బలపడింది. ఇప్పటికీ ఆ పార్టీకి సంస్థాగతంగా మంచి బలం ఉంది. కానీ నేతల్లో ఐక్యత లేక గత రెండుసార్లు ఓటమి మూటగట్టుకుంది. సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి 2009లో సూర్యాపేట ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ ఆయన ఓటమి చవిచూశారు. ఈ సారి దామోదర్‌రెడ్డికి పోటీగా మరో సీనియర్ నేత పటేల్ రమేశ్ రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. గత ఎన్నికల్లోనూ ఈ ఇద్దరూ టికెట్ కోసం పోటీపడ్డారు. అయితే అప్పుడు టిక్కెట్ దామోదర్ రెడ్డికే దక్కింది. ఈ ఇద్దరు నేతల మధ్య గ్రూపు తగాదాల వల్లే గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిందని.. ఈ సారి ఆ పరిస్థితి తలెత్తకుండా చూసుకోవాలని కార్యకర్తలు పార్టీ నేతలను కోరుతున్నారు. కానీ, సీనియర్ నేతగా దామోదర్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో పటేల్ రమేశ్‌రెడ్డి ఎవరికి వారు టికెట్ ప్రయత్నాల్లో ఉండటంతో చివరకు బీ ఫాం ఎవరికి దక్కనుందనే ఉత్కంఠ కాంగ్రెస్ శ్రేణుల్లో కనిపిస్తోంది. సర్వేలు ఎవరికి అనుకూలంగా ఉంటే వారికే టికెట్ దక్కుతుందంటున్న దామోదర్‌రెడ్డి టికెట్‌కే తనకే దక్కుతుందనే ధీమాలో ఉన్నారు. దామోదర్‌రెడ్డికి పోటీగా టికెట్ కోసం ప్రయత్నిస్తున్న పటేల్ రమేశ్ రెడ్డి సైతం తగ్గేదేలఅంటున్నారు. గత ఎన్నికల్లో సీనియర్ల మాట ప్రకారం దామోదర్‌రెడ్డికి సహకరించానని.. ఈసారి తనకు చాన్స్ ఇవ్వాల్సిందేనంటున్నారు రమేశ్‌రెడ్డి. పీసీసీ చీఫ్ రేవంత్ తో ఉన్న సాన్నిహిత్యంతో తనకే టిక్కెట్ ఖాయమనే ధీమాతో ఉన్నారు రమేశ్ రెడ్డి.కాంగ్రెస్ లో టికెట్ కోసం ఇద్దరు నేతలు పోటీపడుతుండగా, మరో ప్రతిపక్ష పార్టీ బీజేపీ పరిస్థితి పెద్దగా ఆశాజనకంగా లేదంటున్నారు. గత ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు చరిష్మాపైనే బీజేపీ ఆశలు పెట్టుకుంది. అయితే సూర్యాపేట పట్టణంలో తప్ప గ్రామీణ ప్రాంతంలో బీజేపీ ఉనికి కనిపించడం లేదని చెబుతున్నారు పరిశీలకులు.మరోవైపు ఇటీవల మంత్రి జగదీశ్ రెడ్డితో విభేదించి బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన వట్టే జానయ్య బీఎస్పీ అభ్యర్థిగా బరిలో దిగేందుకు సిద్ధమై పోయారు. బిసీ నేతలపై అక్రమ కేసులు పెడుతూ జగదీశ్ రెడ్డి అణిచివేస్తున్నారన్న ప్రచారం చేస్తున్నారు జానయ్య. నిన్నమొన్నటి వరకు మంత్రి జగదీశ్‌రెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఉన్న జానయ్య దందాల వెనుక జగదీశ్ రెడ్డి హస్తం ఉందనే ప్రచారం స్థానికంగా జోరుగా సాగుతోంది. ఈ పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే మళ్లీ హోరాహోరీ పోటీ జరిగేలా కనిపిస్తోంది. అయితే అటు బీజేపీ.. ఇటు బీఎస్పీ పార్టీలు చీల్చే ఓట్లే గెలుపోటముల్లో ప్రధాన పాత్ర పోషించే అవకాశాలున్నాయి. అటు కాంగ్రెస్ లో టిక్కెట్ దక్కని నేత తీసుకోబోయే స్టెప్ కూడా సూర్యాపేట ఫలితాన్ని తారుమారు చేసే ఛాన్స్ కనిపిస్తోంది.

చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాను

- స్టేడియానికి వెళ్లడానికి లిఫ్ట్ అడిగేవాడిని
- హైదరాబాద్‌లో నీరజ్ చోప్రా

టి మీడియా, అక్టోబర్ 9, హైదరాబాద్ :

ఆసియా క్రీడల్లో జావెలిన్‌త్రోలో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్న నీరజ్ చోప్రా ఇవాళ హైదరాబాద్‌కు వచ్చాడు. నీరజ్ చోప్రా ఆసియా క్రీడల్లో 88.88 మీటర్ల దూరం జావెలిన్ విసిరి, పారిస్ ఒలింపిక్స్‌కు కూడా అర్హత సాధించిన విషయం తెలిసిందే.హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా నీరజ్ చోప్రా మాట్లాడుతూ.. ఇక్కడకు రావడం ఆనందంగా ఉందని చెప్పాడు. తాను చిన్నప్పుడు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నానని, స్టేడియానికి వెళ్లడానికి లిఫ్ట్ అడిగేవాడినని గుర్తు చేసుకున్నాడు. క్రీడల్లో ప్రాక్టీస్, ఫిట్నెస్ కోసం డైట్ చాలా ముఖ్యమని తెలిపాడు. చిన్నప్పుడు ఉండే పరిస్థితుల వల్ల అది కూడా ఇబ్బంది అయ్యేదని చెప్పాడు.ఇప్పుడు పరిస్థితులు మారాయని, క్రీడాకారులకు ప్రభుత్వం అండ్ స్పాన్సర్స్ ఉన్నారని నీరజ్ చెప్రా తెలిపాడు. దేశంలో క్రీడల కోసం సౌకర్యాలు పెరుగుతున్నాయని చెప్పారు. మెడల్స్ సాధించడానికి క్రీడాకారులకు సమయం పడుతుందని, హార్డ్ వర్క్ అవసరమని చెప్పాడు. ఆసియా క్రీడాల్లో భారత్ అనేక పతకాలు సాధించిందని అన్నాడు.క్రీడల్లో పూర్తి స్థాయిల్లో దృష్టి పెట్టి ఆడాల్సి ఉంటుందని తెలిపాడు. తాను గేమ్ కోసం ఎల్లప్పుడూ కష్టపడుతుంటానని, ప్రతి ఆటలో కొత్తవి నేర్చుకుంటానని చెప్పాడు. కాగా, నీరజ్ చోప్రాతో కలిసి సినీనటుడు రాహుల్ రవీంద్రన్ బ్రేక్ ఫాస్ట్ చేసి ఫొటోలు తీసుకున్నాడు. టాలీవుడ్ హీరో ఆనంద్ దేవరకొండ కూడా వారితోనే ఉన్నాడు.

నవంబర్ 1 నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ ప్రోగ్రాం

సిఎం జగన్

టీ మీడియా, అక్టోబర్ 9, విజయవాడ :

వైసిపి పరాధికారుల సమావేశం సోమవారం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 8,222 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు సభా ప్రాంగణం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి జగన్ వేదికపై మాట్లాడుతూ.. డిసెంబర్ 11 నుంచి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం చేపడుతున్నామని ప్రకటించారు. గ్రామస్థాయిలో నైపుణ్యం ఉన్న క్రీడాకారులను గుర్తిస్తామన్నారు.

మిగతా 2లో

ముడిచమురు ధరలు పెరిగితే ముప్పు తప్పదు

- పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరీ

టీ మీడియా, అక్టోబర్ 9, న్యూఢిల్లీ :

ఇజ్రాయెల్-హమాస్ వార్ నేపథ్యంలో మధ్య ప్రాచ్యంలో నెలకొన్న వివాదాన్ని భారత్ నిశితంగా పరిశీలిస్తోందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్, హమాస్ మధ్య భీకర దాడులతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 3 డాలర్లు పైగా పెరిగిన క్రమంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. హమాస్ దాడులతో మధ్యప్రాచ్యంలో రాజకీయ అనిశ్చితి కారణంగా చమురు సరఫరాలపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. వివాదం సాగుతున్న ప్రాంతంలో వాణిజ్య ప్రాధాన్యతపై ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరీ మాట్లాడుతూ.. అంతర్జాతీయ ఇంధనానికి ఆ ప్రాంతం సెంట్రల్ హబ్‌గా ఉందని, ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమైనా భారత్ దీటుగా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉందని అన్నారు. అంతర్జాతీయంగా ఇలాంటి అనిశ్చితి పరిస్థితులు సురక్షిత ఇంధనాల వినియోగం ప్రాధాన్యతను పెంచుతాయని చెప్పారు. ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లు దాటితే ద్రవ్యోల్బణం పరుగులు పెడుతుందని, భారత్ వంటి ముడిచమురు దిగుమతి దేశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

పకడ్బందిగా ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

- ఫ్లెక్సీలు, ఫోటోలను 72 గంటల్లో తొలగించాలి
- మీడియా సెంటర్ ఏర్పాటు
- సీఎం, మంత్రుల ఫోటోలు తొలగించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

టి మీడియా, అక్టోబర్ 9, హైదరాబాద్ :

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలను భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనల ప్రకారం పకడ్బందిగా ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారివికాస్రాజ్అన్నారు.సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికలపై పై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ,లి భారత ఎన్నికల కమిషన్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు 2023 కు షెడ్యూల్ విడుదల చేసిందని, రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, 24 గంటల వ్యవధిలో ప్రతి ప్రభుత్వ భవనాలలో వివిధ రాజకీయ పార్టీలకు, నాయకులకు సంబంధించిన హోర్డింగులు, నాయకుల ఫోటోలు , వాల్ రైటింగ్స్ తొలగించాలని, 48 గంటల వ్యవధిలో పబ్లిక్ ప్రాపర్టీస్ వద్ద హోర్డింగులు, ఫ్లెక్సీలు ఫోటోలు తొలగించాలని, ప్రైవేట్ స్థలాలో ఉన్న హోర్డింగులు, ఫ్లెక్సీలు, ఫోటోలను 72 గంటల్లో తొలగించాలని ఆయన అధికారులకు ఆదేశించారు.రాష్ట్రంలో ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల వెబ్ సైట్, జిల్లా వెబ్ సైట్ లలో మంత్రుల ఫోటోలు, ముఖ్యమంత్రి ఫోటో తొలగించాలని అన్నారు. రాజకీయ పార్టీలు, వివిధ వర్గాల చెందిన ప్రజలకు ర్యాలీలు, సభల నిర్వహణకు అనుమతులు నిబంధనల ప్రకారం ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో జారీ చేయాలని ఆయన సూచించారు.

మిగతా 2లో

కాంగ్రెస్ 6 గ్యారెంటీలతో కేసీఆర్ కు చలి జ్వరం

- తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

టీ మీడియా, అక్టోబర్ 9, హైదరాబాద్ :

కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలతో తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు రావడం ఖాయమని తాము ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో సీఎం కేసీఆర్ కు చలి జ్వరం వచ్చిందని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రజలను కల్వకుంట్ల కుటుంబం పట్టి పీడిస్తోందని విమర్శించారు. ప్రజాధనాన్ని కేసీఆర్ కుటుంబం దోచుకుందని ఆరోపించారు. సచివాలయ నిర్మాణంలోనూ దోపిడీ జరిగిందని వెల్లడించారు. తెలంగాణను బీఆర్ఎస్ వంచించిందని, ప్రతి రంగంలోనూ కేసీఆర్ కుటుంబం అవినీతికి పాల్పడిందని మండిపడ్డారు. అయితే, వచ్చే డిసెంబరులో తెలంగాణలో మరో అద్భుతం జరగబోతోందని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలకు విముక్తి లభిస్తుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఇక విశ్రాంతి తీసుకునే సమయం వచ్చిందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయం

- మంత్రి కేటీఆర్

టీ మీడియా, అక్టోబర్ 9, వరంగల్ :

ఎన్నికల తేదీలను చూస్తుంటే.. కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం పక్కా అనిపిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పరకాల నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ప్రగతి నివేదన సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. నవంబర్ 30 ఎన్నికలు, డిసెంబర్ 3న కౌంటింగ్.. ఈ తేదీలను చూస్తుంటే కరెక్ట్‌గా ఈసారి మనకు లెక్క కూడా కుదిరినట్టు ఉందని కేటీఆర్ తెలిపారు. 30, 03, కేసీఆర్ మూడోసారి కూడా ముఖ్యమంత్రి అవుడు హ్యాట్రిక్ పక్కా అనిపిస్తుంది. మనకు అన్ని కలిసి వస్తున్నాయి. మూడు మూడు ఆరు.. మన లక్కీ నంబర్ కూడా ఆరే. మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుడు కూడా పక్కానే ఉన్నది. తేదీలు కూడా మంచిగానే కుదిరినట్టు

అనిపిస్తుంది అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎలక్షన్లు వచ్చాయి.. ఇక సంక్రాంతి పండుగకు గంగిరెద్దుళ్లోళ్లు వచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు వస్తారని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ నాయకులు నోటికొచ్చిన కథలు చెబుతారు. కేసీఆర్, ధర్మారెడ్డిని ఓడించమని చెబుతారు. విచక్షణతో, ఆలోచనతో చైతన్యాన్ని ప్రదర్శించి ఓటేయాలి. క్యాలికులేటేడ్‌గా ఆలోచించాలి. ఆగం కావొద్దు. 2014లో మన పరిస్థితి ఏంది..? ఇప్పుడు పరిస్థితి ఏంది? అనేది ఆలోచించాలి. కరెంట్, మంచినీళ్లు, వ్యవసాయం, సాగునీటి, సంక్షేమం గురించి ఆలోచించండి. రెచ్చగొట్టే ముచ్చట్లు చెబితే ఆగం కావొద్దు.. ఆందోళన చెందొద్దు. మేం చెప్పింది వాస్తవమైతే ధర్మారెడ్డిని 70 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కేటీఆర్ కోరారు. కాంగ్రెస్ హయాంలో కాలిపోయే మోటార్లు.. పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితిని చూశామని కేటీఆర్ తెలిపారు. ఆరు గంటల కరెంట్ కూడా మూడుసార్లు ఇచ్చేవారు. దీంతో నాడు వ్యవసాయం ఆగమైంది. పరిశ్రమలు నడుపుదామంటే కరెంట్ లేదు. మరి ఇవాళ 60 ఏండ్లలో కరెంట్ ఇవ్వని కాంగ్రెస్.. ఇవాళ వచ్చి అది చేస్తా.. ఇది చేస్తా అని డైలాగులు కొడితే మోసపోదామా..? ఆరు నెలల్లోనే కరెంట్ సమస్యను పరిష్కరించిన కేసీఆర్‌కు ఓటేద్దామా? అనేది ఆలోచించుకోవాలని కేటీఆర్ సూచించారు.

ఓటమి భయంతోనే ఇడి దాడులు

-బిజెపిపై కేరళ సిఎం విజయన్ విమర్శ

టీ మీడియా, అక్టోబర్ 9, కన్నూర్ :

మూడోసారి అధికారంలోకి రావడం సాధ్యం కాదనే భయంతోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌తో బిజెపి నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వం దాడులు చేయిస్తోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న నాలుగు రాష్ట్రాల్లో ఏకకాలంలో శనివారం ఇడి దాడులు నిర్వహించింది. ధర్మాడం నియోజకవర్గంలో ఎల్‌డిఎఫ్ కుటుంబాలతో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. బిజెపి కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడం కోలుకోలేని ప్రమాదమనే వాస్తవాన్ని దేశ ప్రజలు గుర్తించారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఇతర రాష్ట్రాలతోపాటు కాకరూరిలో ఇడితో దాడులు చేయించిందని విమర్శించారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో మరిన్ని దాడులు జరిగే అవకాశముందని తెలిపారు. బిజెపియేతర అభ్యర్థి ఎవరు గెలిచినా ఫర్వాలేదని అనుకోకుండా లౌకికవాదానికి గట్టిగా కట్టుబడే వారిని, మతతత్వాన్ని ప్రతిఘటించే వారిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ విషయంలో కాంగ్రెస్ ఎప్పుడూ కచ్చితమైన వైఖరిని తీసుకోలేకపోయిందని ముఖ్యమంత్రి అన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఆటో

- నలుగురు దుర్మరణం

టీ మీడియా, అక్టోబర్ 9, కడప :

ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జిల్లాలోని ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి సమీపంలో ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. ప్రొద్దుటూరు, కడపకు చెందిన 11 మంది ప్రొద్దుటూరు నుంచి మల్లెలకు ఆటోలో వెళ్తున్నారని, ఈ క్రమంలో లారీని క్రాస్ చేయబోతుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఆటో ఢీకొట్టిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఆరుగురికి తీవ్రంగా గాయాలయ్యాయని చెప్పారు. మృతులను మహమ్మద్, హసీనా, అమీనా, షాకీర్‌గా గుర్తించామన్నారు. ఈ ఘటనపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

హీరో షారుక్‌ఖాన్‌కు బెదిరింపులు

- వై-ప్లస్ భద్రత కల్పించిన సర్కార్

టీ మీడియా, అక్టోబర్ 9, ముంబై :

బాలీవుడ్ ప్రముఖ హీరో షారుక్‌ఖాన్‌కు చంపేస్తామంటూ బెదిరింపు లేఖలు ముంబయిలోని షారుక్ ఇంటి మన్నత్‌కు వచ్చాయి. దీంతో షారుక్ ముంబయి పోలీసులను ఆశ్రయించారు. తనకు వస్తోన్న బెదిరింపు కాల్స్ నేపథ్యంలో మరింత భద్రత కల్పించాల్సిందిగా షారుక్ మహారాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలను తీసుకుంది. షారుక్‌కు కల్పించిన భద్రతను మరింత పెంచింది. దాన్ని వై-ప్లస్ కేటగిరీగా మారుస్తూ ప్రకటన చేసింది. ఈ మేరకు మహారాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆరుగురు వ్యక్తిగత భద్రతా సిబ్బందిని నియమించింది. వారు మూడు షిఫ్టుల్లో షారుఖ్‌కు భద్రత కల్పించనున్నారు. ఇక మరోవైపు కొందరు వ్యక్తులు షారుక్ ఫొటోలను ట్రోల్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. దీనిపై ఆయన అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. షారుఖ్ నటించిన రెండు చిత్రాలు జవాన్, పఠాన్ భారీ కలెక్షన్‌లతో రికార్డులు సృష్టిస్తున్నాయి. వీటి తర్వాత షారుక్‌కు బెదిరింపులు ఎక్కువయ్యాయి. ఆయన్ని చంపేస్తామంటూ ముంబయిలోని ఆయన నివాసం మన్నత్‌కు పలు లేఖలు వచ్చాయి.

వాషింగ్టన్‌లో భూకంపం

టీ మీడియా, అక్టోబర్ 9, వాషింగ్టన్ :



వాషింగ్టన్‌లో సియాటిల్‌లో సోమవారం ఉదయం బలమైన భూకంపం సంభవించింది. పశ్చిమ వాషింగ్టన్‌లో ఆదివారం సాయంత్రం 4.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. పసిఫిక్ నార్త్‌వెస్ట్ సీస్మిక్ నెట్‌వర్క్ ప్రకారం.. రాత్రి 7:21 గంటలకు మారోస్టోన్ ద్వీపం కింద భూకంప కేంద్రంగా గుర్తించారు. భూకంపం 57 కిలోమీటర్ల లోతులో వచ్చి ఉంటుందని తెలిపింది. భూకంపం సీటెల్‌కు వాయువ్యంగా ఉన్న పుగెట్ సౌండ్ రీజియన్‌లో.. పోర్ట్ టౌన్‌సెండ్‌కు దక్షిణంగా వాషింగ్టన్‌లోని మారోస్టోన్‌కు దక్షిణంగా 2.5 మైళ్ల దూరంలో ఉన్నట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. వాషింగ్టన్‌లోని సియాటిల్‌లో సునామీ వచ్చే అవకాశం లేదని అమెరికా జాతీయ సునామీ హెచ్చరికల కేంద్రం తెలిపింది. రిపోర్టింగ్ సమయంలో భూకంప ప్రభావం పూర్తి స్థాయిని పూర్తిగా అంచనా వేయనప్పటికీ.. తదుపరి సునామీ గురించి ఎలాంటి అంచనా లేదని అధికారులు చెప్పడం ద్వారా భరోసా ఇచ్చారు. ఈ ప్రాంతం తీరప్రాంతం ఎక్కువగా ఉండటంతో సునామీ ఉంటుందనే అంచనాలు తప్పు అని చెప్పారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు.

ఏపీ హైకోర్టులో చంద్రబాబుకు షాక్

టీ మీడియా, అక్టోబర్ 9, అమరావతి :

స్కిల్‌డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయి రాజమండ్రి జైలులో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబాకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మాజీ ముఖ్యమంత్రి దాఖలు చేసిన మూడు ముందస్తు బెయిల్ పిటిషన్లను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఫైబర్‌నెట్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు కేసుల్లో ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై తీర్పు వెలువరించింది. కాగా, స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విజయవాడలోని ఏసీబీ కోర్టు తీర్పును మధ్యాహ్నం వెలువరించనుంది. ఇటీవల విచారణ చేపట్టిన కోర్టు తీర్పును నేటికి వాయిదా వేసినవిషయం తెలిసిందే. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం చంద్రబాబు బెయిల్, సీఐడీ కస్టడీపై న్యాయస్థానం తీర్పునివ్వనుంది. దీంతోపాటు రెండు పీటీ వారెంట్లపై కూడా విచారణ జరిపే అవకాశం ఉన్నది.

ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రకటనతో బీజేపీకి వీడ్కోలే

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

టీ మీడియా, అక్టోబర్ 9, న్యూఢిల్లీ :

ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రకటనతో దేశంలో రాజకీయ వేడి మొదలైంది. తెలంగాణతో పాటు మరో నాలుగు రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రకటనతోపాటు బీజేపీకి ఫేర్‌వెల్ ప్రకటించినట్లైందని విమర్శించారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. 'ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రకటనతో.. బీజేపీ దాని మిత్ర పక్షాలకు ఫేర్‌వెల్ ప్రకటించినట్లే. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మిజోరాం రాష్ట్రాల్లో రాబోయే ఎన్నికల్లో సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం, ప్రగతిశీల అభివద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి వెళ్తుంది' అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

అమల్లోకి ఎన్నికల కోడ్

- అసెంబ్లీ అధికారులు ఆంక్షలు

టీ మీడియా, అక్టోబర్ 9,హైదరాబాద్ :

కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో సోమవారం అసెంబ్లీ అధికారులు ఆంక్షలు విధించారు. అసెంబ్లీ ఆవరణలో ఎలాంటి పార్టీ కార్యక్రమాలు నిర్వహించొద్దని ఆదేశాలు జారీ చేశారు. అంతేకాదు మీడియా ప్రతినిధులు సైతం అసెంబ్లీ ఆవరణలో లైవ్‌లు నిర్వహించొద్దని సూచించారు. ఎవరైనా ఆదేశాలను అతిక్రమిస్తే అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు ప్రకటించిన నేపథ్యంలో సోమవారం నుంచి అసెంబ్లీ ఆవరణలో సైతం ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని వెల్లడించారు. మీడియా ప్రతినిధులు, పార్టీల నేతలు ఎన్నికల కోడ్ నేపథ్యంలో సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

టిటిడి పారిశుధ్య కార్మికులకు జీతాలు పెంపు : టిటిడి ఛైర్మన్

- ముగిసిన పాలకమండలి సమావేశం
- పలు కీలక నిర్ణయాలు

టీ మీడియా, అక్టోబర్ 9,తిరుమల:

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పాలకమండలి సమావేశం ముగిసింది. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ మేరకు పాలకమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. టిటిడి పారిశుధ్య కార్మికుల జీతాలను 12 వేల నుంచి 17 వేలకు పెంచాలని నిర్ణయించింది. 5 వేల మంది పారిశుధ్య కార్మికులకు జీతాలు పెంచనున్నారు. అలానే టిటిడి పరిధిలోని కార్పోరేషన్ లో విధులు నిర్వర్తిస్తూన్న ఉద్యోగుల జీతాలను ప్రతి సంవత్సరం 3 శాతం పెంచేలా.. కార్పోరేషన్లో పని చేసే ఉద్యోగులు ఆకాల మరణం పోందితే వారికి 2 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించేలా.. కార్పోరేషన్ లో పని చేస్తూ ఈఎస్ఐ వర్తించని ఉద్యోగులుకు హేల్త్ స్కీం అందించేలా నిర్ణయం తీసున్నామన్నారు. ఇకపైన అలిపిరి వద్ద ప్రతి నిత్యం శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హౌమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. నారాయణగిరి ఉద్యాణవనంలో కంపార్టుమెంట్లు ఏర్పాటు చేసేందుకు 18 కోట్లు కేటాయిచమని వెల్లడించారు. అలానే ఆకాశ గంగ నుంచి అవుటర్ రింగ్ రోడ్డు వరకు 40 కోట్ల వ్యయంతో నాలుగు వరుసల రోడ్డు, తిరుపతి లోని చేర్లోపల్లి నుంచి శ్రీనివాస మంగాపురం వరకు 25 కోట్ల వ్యయంతో నాలుగు వరుసల రోడ్డుని, వరహస్వామి అతిథి గహం నుంచి అవుటర్ రింగ్ రోడ్డు వరకు 10.8 కోట్లతో నాలుగు వరుసల రోడ్డు నిర్మించనున్నట్లు అలానే గరుడా సర్కిల్ వద్ద రోడ్డు వెడల్పు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అనర్హులకు ఇచ్చిన దళిత బందు ను రద్దు చేయాలి

- మండవ వెంకటేశ్వర్లు

టి మీడియా, అక్టోబర్ 9, సూర్యాపేట :

గరిడేపల్లి మండలం తాళ్ల మల్కాపురం గ్రామంలో అనర్హులకు ఇచ్చిన దళిత బంధు యూనిట్లను రద్దు చేయాలని కోరుతూ.. గ్రామంలోని దళితులందరూ సూర్యాపేట కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నల్గొండ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి, హుజూర్ నగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ మండవ వెంకటేశ్వర్లు ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. అనర్హులైన వారి దళిత బంధు యూనిట్లను రద్దుచేసి అర్హులైన వారికి గ్రామసభల ద్వారా ఎంపిక చేసి యూనిట్లను అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ను అడ్డుకుని పెద్ద ఎత్తున నినాదాలు చేసి వినతి పత్రం అందించగా, గరిడేపల్లి మండలం లోని దళిత బంధు యూనిట్లు అన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. దీంతో దళితులందరూ కలెక్టర్ క అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాళ్ల మల్కాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వట్టికూటి వెంకట నరసయ్య (బాబు), గ్రామ దళితులు కోట సాలయ్య, పోలేపల్లి రాంబాబు, కత్తి వెంకటేశ్వర్లు, దాసరి గురు స్వామి,గండమల్ల సుధాకర్, గండమల్ల వీరబాబు, చింతమల నరసయ్య, కుర్రి సైదులు, కుర్రి మహేష్ ,కుర్రి కోటయ్య, కోట గోపి, కత్తి సైదులు, అవిరేనిఅంజయ్య , అవిరెని రాంబాబు, కోట సుధాకర్, నకిరేకంటి వీరస్వామి, కోట జాన్ ప్రవీణ్, గుండెపంగు అభి, గుండెపంగు నరసమ్మ, ఆవిరిని వెంకటమ్మ, కోట మంగమ్మ, కోట రమణ , మరియమ్మ, లలిత, సరోజనమ్మ గోవిందమ్మ ,జెట్టి వెంకటమ్మ కత్తి సృజన మచ్చ పద్మ, గ్రామ దళిత మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పకడ్బందిగా ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

- ప్లెక్సీలు, ఫోటోలను 72 గంటల్లో తొలగించాలి
- మీడియా సెంటర్ ఏర్పాటు
- సీఎం, మంత్రుల ఫోటోలు తొలగించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

టి మీడియా, అక్టోబర్ 9, హైదరాబాద్ :

నవంబర్ 3న అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని, అప్పటి వరకు ఫ్లైయింగ్ స్క్వాడ్ బందాలు, కంట్రోల్ రూమ్ ఏర్పాటు, మీడియా సెంటర్ ఏర్పాటు, ఎన్నికల విధుల నిర్వహణకు సిబ్బంది శిక్షణ తదితర కార్యక్రమాలు పూర్తి చేయాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వివరాలు సమర్పించాలని అన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలకు అనుమతి అదే రోజు అందించే విధంగా ఎంసిఎంసి పని చేయాలని అన్నారు. శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికలకు సంబంధించి రిపోర్ట్ లు ప్రతి రోజూ సమర్పించే విధంగా జిల్లాలో వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. 2023 తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో 80 ఏళ్ళ పై బడిన వారికి, దివ్యాంగులకు ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందని, దీనికి ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లాలో దివ్యాంగుల ఓటర్లను పోలింగ్ కేంద్రాల వారిగా మ్యాపింగ్ చేసుకోవాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు , ఇతర ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫిర్యాదులు సేకరించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో త్రాగునీరు, లైటింగ్ ,ర్యాంపు, నీటి సరఫరాతో కూడిన టాయిలెట్లు మొదలగు మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని అన్నారు. నామినేషన్లు స్వీకరించే సమయంలో రిటర్నింగ్ అధికారులకు భద్రత ఏర్పాటు చేయాలని, అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించే సమయంలో నిబంధనలు పాటిస్తూ నామినేషన్ లో అన్ని అంశాలు నింపారో లేదో చెక్ చేసుకోవాలని,%అ% నింపని పక్షంలో సదరు అభ్యర్థులకు రాతపూర్వకంగా సమాచారం అందించాలని అన్నారు ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన ప్రతినిధులు ప్రభుత్వ మిషనరీ ఎన్నికల కోసం వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని, అక్టోబర్ 30 వరకు వచ్చే నూతన ఓటరు దరఖాస్తులను పరిశీలించాలని, ఓటింగ్ స్లిప్పుల పంపిణీ నామినేషన్ల ముగింపు తేది అనంతరం నుంచి చేపట్టాలని అన్నారు.

నవంబర్ 1 నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ ప్రోగ్రాం

- సిఎం జగన్

టీ మీడియా, అక్టోబర్ 9, విజయవాడ :

విజేతలు రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. భారత్ టీమ్‌లో వై నాట్ ఏపీ పరిస్థితి రావాలని కోరారు. జనవరి 15 వరకూ ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరం ప్రారంభమవుతుందని సిఎం హర్షాన్ని వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో పేదవాడికి పెత్తందార్లకు యుద్ధం జరగనుందని, పెత్తందార్లుపై గెలవాలంటే పేదవారంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో జరిగేది క్లాస్ వార్ అని వర్ణించారు. అక్టోబర్ 25 నుంచి డిసెంబర్ 31వరకు బస్సుయాత్ర నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. మూడు ప్రాంతాల్లో బస్సుయాత్ర నిర్వహిస్తామన్నారు. బస్సుయాత్ర బఅందంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతలుంటారని చెప్పారు. ప్రతి రోజూ మూడు మీటింగ్‌లు జరుగుతాయన్నారు. ప్రభుత్వం చేసిన మంచి సామాజిక న్యాయం, సాధికారత గురించి చెప్పాలన్నారు. ఇది బస్సుయాత్రే కాదు.. సామాజిక న్యాయయాత్ర అని అన్నారు. పేదవారికి జరిగిన మంచిని గురించి వివరించే యాత్ర అని తెలిపారు. " మళ్లీ జగనే ఎందుకు సీఎం కావాలో చెప్పే కార్యక్రమమే వై ఏపీ నీడ్స్ జగన్ " అని ముఖ్యమంత్రి వివరించారు. గ్రామస్థాయిలో నిర్వహించే కార్యక్రమానికి ప్రజలంతా కూడా శ్రీకారం చుట్టాలన్నారు. రాష్ట్రంలో జరిగిన మంచి గురించి ప్రజలకు చెప్పాలని కోరారు. 2019లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్.. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. ప్రజలకు మరింత మంచి చేయడానికి మళ్లీ జగన్ రావాలని అన్నారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 10వరకూ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని చేపడతామని ముఖ్యమంత్రి జగన్ ప్రకటించారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి మరింత విస్తతంగా తీసుకెళ్లాలని సిఎం తెలిపారు. రాష్ట్రంలో ఏ ఒక్క కుటుంబం కూడా వ్యాధుల బారిన పడకూడదని, వ్యాధి సోకిన వారికి తగిన చికిత్స ఇచ్చేందుకు సురక్ష పథకం తెచ్చామని, 15వేల హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, సురక్ష ద్వారా కోటి 65 లక్షల ఇళ్లను కవర్ చేస్తున్నామని సిఎం చెప్పారు. 31 లక్షల ఇళ్ల పట్టాలు అక్క చెల్లెమ్మలకు ఇచ్చామని అన్నారు. 22 లక్షల ఇళ్లు అక్క చెల్లెమ్మల పేరుతో నిర్మాణం జరుగుతున్నాయని వెల్లడించారు. ఇందులో 80శాతం పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చామన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చామని సిఎం జగన్ అన్నారు. పేదరికంలో ఉన్నవారు ఉన్నత స్థానానికి వచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. అక్క చెల్లెమ్మల సాధికారతకు కషి చేశామన్నారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు ఇచ్చామని తెలిపారు. స్థానిక సంస్థల నుంచి కేబినెట్ వరకూ సామాజిక న్యాయం చేశామన్నారు. వైఎస్ జగన్ అంటే మాట నిలబెట్టుకుంటాడని నిరూపించుకున్నామని అన్నారు. సామాజిక వర్గాలకు, ప్రాంతాలకు సమన్యాయం చేశామన్నారు. రూ. 2లక్షల 35వేల కోట్లు డీబీటీ ద్వారా అందించామన్నారు. అధికారాన్ని ప్రజలకు తొలి సేవకుడి బాధ్యతగా తీసుకు న్నామని సిఎం జగన్ చెప్పారు. ప్రజలకు సేవకుడిగా సేవలందించాను కాబట్టే 52 నెలల కాలంలో సువర్ణాక్షరాలతో లిఖించేలా పాలన అందించామన్నారు. మూడు ప్రాంతాల ప్రజల ఆత్మ గౌరవాన్ని కాపాడుతూ మూడు రాజధానులు నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి జగన్ అన్నారు.

రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

టి మీడియా, అక్టోబర్ 9,జనగామ :

రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రైతుబంధు సమితి అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాజయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాజయ్యకు పలువురు రైతులు, స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే టికెట్‌ను ఈసారి కడియం శ్రీహరికి కేటాయించిన నేపథ్యంలో రాజయ్యకు కార్పొరేషన్ పదవితో సముచిత ప్రాధాన్యం కల్పించారు. రాజయ్య రైతుబంధు సమితి అధ్యక్షుడిగా రెండేండ్ల పాటు కొనసాగనున్నారు.

కాంగ్రెస్ నేత పేరుతో ప్రెజర్ కుక్కర్ల పంపిణీ

- కేసు నమోదు

టి మీడియా, అక్టోబర్ 9,హైదరాబాద్ :

ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే, పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రధానంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు తీవ్ర ప్రయత్నాలు చేసే అవకాశం ఉంది. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ నేత ఇంట్లో ఓటర్లకు పంచేందుకు పెద్ద మొత్తంలో సిద్ధంగా ఉన్న ప్రెజర్ కుక్కర్లను పోలీసులు సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలోని గోపాన్ పల్లి తండాలో.. రాములు నాయక్ ఇంట్లో గచ్చిబౌలి పోలీసులు పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. దీంతో ఓటర్లకు పంచేందుకు సిద్ధంగా 87 ప్రెజర్ కుక్కర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని, రాములు నాయక్, నరసింహాలపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన ప్రెజర్ కుక్కర్లు శేరిలింగంపల్లి కాంగ్రెస్ నేత రఘునాథ్ యాదవ్ కు చెందినవిగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కాన్షీరాం వర్ధంతి వేడుకలు

టి మీడియా, అక్టోబర్ 9, హుజూర్ నగర్ :

సోమవారం హుజూర్నగర్ నియోజకవర్గ కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు మంద రవి అధ్వర్యంలో బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు , బహుజన రాజ్యాధికార పితామహులు కాన్షీరాం 17వ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దేశగాని సాంబశివగౌడ్ కాన్షిరాం చిత్రపటానికి నివాళులు అర్పించి తదనంతరం హైదరాబాద్ లో నాంపల్లి ఎక్సిబిషన్ గ్రౌండ్ లో జరిగే కాన్షిరామ్ వర్ధంతి సభకు హుజూర్ నగర్ నియోజకవర్గం నుండి బహుజన నాయకులు భారీఎత్తున బయలు దేరడం జరిగింది. ఇట్టి కార్యక్రమములో సూర్యాపేట జిల్లా మహిళా కన్వీనర్ వెంపటి నాగమణి, నియోజికవర్గ ఇంచార్జీ బొల్లగాని సబ్బు గౌడ్,మహిళా కన్వీనర్ మెండం రమణ,కో కన్వీనర్ కట్టెబోయిన సునీత యాదవ్, మేళ్లచెరువు మండల అధ్యక్షులు యామపంగు మహేష్, దిరిషించర్ల గ్రామ శాఖ అధ్యక్షులు హరీష్, కళ్యాణ్ వర్మ,శివకళ్యాణ్ నితిన్,నాగరాజు, చింటు,పవన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన కౌన్సిలర్

టి మీడియా, అక్టోబర్ 9, హుజూర్ నగర్ :

4వ వార్డులో సిడిపి నిధుల నుంచి సూపర్ మార్కెట్ వెనుకాల బజార్లో ఐదు లక్షల రూపాయలు సీసీ రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వరరావు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోవు రోజుల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు, అభివద్ధికి ప్రజల సహకారంతో మునుముందుకు నడుస్తామని ,సంక్షేమ పథకాలు అన్నిటిని ప్రతి ఒక్కరికి అందజేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హుజూర్నగర్ మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి , 22 వార్డు కౌన్సిలర్ సతీష్,,యడ్ల విజయ్ వార్డు ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రజక భవన నిర్మాణానికి భూమి పూజ

టి మీడియా, అక్టోబర్ 9, గోదావరిఖని :

రామగుండం శాసనసభ్యులు కోరుకంటి చందర్ ఆశీస్సులతో, గోదావరిఖని బస్టాండ్ ఆవరణలో సోమవారం 27 డివిజన్ ప్రాంతంలో ఉన్న దోబి ఘాటులో గోదావరిఖని రజక సహకార సంఘం ఆధ్వర్యంలో రజక భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా రామగుండం కార్పొరేషన్ మేయర్ బంగి అనిల్ కుమార్,27 డివిజన్ కార్పొరేటర్ కలవల శిరీష్ సంజీవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని భూమి పూజ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి గోదావరిఖని రజక సంఘం అధ్యక్షులు పైడిపల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శి మామిడి సతీష్, లాండ్రీ షాప్ అధ్యక్షుడు బండి లక్ష్మణ్,వడ్లూరి దేవయ్య,మహిళ నాయకురాలు కొమురక్కబస్తి పెద్దమనిషిని అడిగొట్టు పోశం, వెదరే కొండయ్య, జనగామ సాయిలు, నరసయ్య, రామచందర్, మామిడి పోశం, జాలిగపు ఐలయ్య, సంఘపు శంకరయ్య, ముక్కెర శ్రీనివాస్,పైడ్ రాజయ్య,మామిడి మహేందర్,రావుల రమేష్,మహిళా నాయకురాలు స్వరూప,సరోజన, సమ్మక్కఅశోక్, సంజీవ్,రాజు, రవి,మనోజ్,రవితేజ, అధిక సంఖ్యలో రజక కుల బంధువులు అందరూ పాల్గొని ఈ భూమి పూజ విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి రామగుండం కార్పొరేషన్ వర్క్ ఇన్స్పెక్టర్ గోపి,కాంట్రాక్టర్ తేజ, పాల్గొనడం జరిగింది.

ఆర్జీ-3 డిపార్ట్మెంట్ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

టి మీడియా, అక్టోబర్ 9, గోదావరిఖని :

కలిసికట్టుగా క్రీడాస్ఫూర్తితో క్రీడలలో పాల్గొనాలని ఓసిపి-2 మేనేజర్ రామారావు క్రీడాకారులకు సూచించారు. సెంటినరీ కాలనీ రాణి రుద్రమాదేవి క్రీడా మైదానంలో సోమవారం ఆర్.జి-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల డిపార్ట్మెంట్ స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులుగా అందరికి స్ఫూర్తిగా నిలుస్తూ కలిసికట్టుగా క్రీడలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్రీడా గౌరవ కార్యదర్శి సునీల్ ప్రసాద్, రాజు, సమన్వయ కర్త భూస వెంకటేశ్వర్లు,కెప్టెన్ సంపత్ కుమార్, సీనియర్ క్రీడాకారులు ముకేష్ కుమార్, శేషగిరి,ప్రసాద్, నాగరాజు, శంకర్, నరసింహారెడ్డి,అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు ఫీజు కట్టిన

- రామగుండం లైయన్స్ క్లబ్ అఫ్ మగువ సభ్యులు

టి మీడియా, అక్టోబర్ 9, గోదావరిఖని :

గోదావరిఖని సింగరేణి స్కూల్ లో చదువుతున్న నలుగురు నిరుపేద విద్యార్థులకు రామగుండం లయన్స్ క్లబ్ ఆఫ్ మగువ సభ్యులు అమ్మ పరివార్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నలుగురు నిరుపేద విద్యార్థుల స్కూల్ ఫీజును చెల్లించారు.రామగుండం లయన్స్ క్లబ్ ఆఫ్ మగువ అధ్యక్షురాలు టి.లక్ష్మీ వాణి 10వేల రూపాయల ఫీజును ఒక విద్యార్థికి, రామగుండం లైన్స్ క్లబ్ ఆఫ్ మగువ ట్రెజరర్,సురపవేణి అనుదీప్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సురపవేని శశికళ ముగ్గురు విద్యార్థులకు 17,000 రూపాయల స్కూల్ ఫీజును ముగ్గురు విద్యార్థులకు కట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సింగరేణి హై స్కూల్ ప్రిన్సిపల్ బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థుల, విద్యాభ్యాసం కై, ప్రోత్సాహం అందించి ఇది 27వేల రూపాయల స్కూల్ ఫీజులు చెల్లించిన లైన్స్ క్లబ్ ఆఫ్ మగువ రామగుండం సభ్యులు టి.లక్ష్మి వాణి,సురపవేణి శశికళ కి ధన్యవాదాలు తెలిపారు.నిరుపేద విద్యార్థుల విద్యాభ్యాసం కొరకై ప్రోత్సాహం అందించి వారి యొక్క చదువును కొనసాగించడానికి సహాయం చేయడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ పరివార్ స్వచ్ఛంద సేవా సంస్థ బాధ్యులు కరణ్,సింగరేణి స్కూల్ టీచర్స్, తదితరులు పాల్గొన్నారు.

గృహహింస బాధితుల కోసం భరోసా, సఖీ కేంద్రాలు

మంత్రి హరీశ్‌రావు

టీ మీడియా, అక్టోబర్ 9, సిద్దిపేట :

గృహ హింస బాధితుల కోసం భరోసా, సఖీ కేంద్రాలను సిద్దిపేట జిల్లాలో అందుబాటులోకి తీసుకొచ్చామని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి మరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి- వెళ్కుపల్లిలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వద్దాశ్రమం, మహిళా ప్రాంగణం, జిల్లా మహిళా సమాఖ్య భవనాలను మంత్రి హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచేలా సిద్దిపేట జిల్లా మహిళా సమైక్య భవనాన్ని నిర్మించామని తెలిపారు. రూ. కోటితో మూడు ప్రాంగణాలనుకలిపి ప్రహరీ గోడ నిర్మించామని చెప్పారు. మరో రూ. కోటి పది లక్షల తో సీసీ కెమెరాలు, ఫర్నిచర్ అందుబాటులోకి తెస్తామన్నారు. సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో భరోసా, సఖి, ఉమెన్స్ వర్కింగ్ హాస్టల్, బాల రక్ష భవన్ నిర్మించామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. శిశు గహను కూడా ఏర్పాటు చేశాం. ఇక్కడ వృద్ధాశ్రమం, మహిళా ప్రాంగణం, జిల్లా మహిళా సమాఖ్య భవనాలను ఏర్పాటు చేశాం. వద్ధాశ్రమంలో తల్లిదండ్రులు పట్టించుకోని వయోవద్ధులను తల్లిదండ్రులలాగ చూసుకుంటామన్నారు. మహిళా ప్రాంగణంలో మహిళలకు వత్తి శిక్షణ ఇస్తాం. గృహ హింస బాధితుల కోసం భరోసా, సఖీ కేంద్రాలు, అనాథ బాలల కోసం శిశు గహ ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగాలు చేసే మహిళల కోసం ఉమెన్స్ వర్కింగ్ హాస్టల్ అందుబాటులోకి తెచ్చామన్నారు. అవసరమైన వారు ఉపయోగించుకునేలా అందరికీ వీటి గురించి తెలపాలని హరీశ్‌రావు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజా రాధాకష్ణ శర్మ, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, మహిళా సమాఖ్య సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి కేసీఆర్ సీఎం అవుతారు

- అసద్ ఆసక్తికర వ్యాఖ్యలు

టీ మీడియా, అక్టోబర్ 9,హైదరాబాద్ :

తెలంగాణ అసెంబ్లీకి ఒకే విడతలో నవంబరు 30న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ సోమవారం ప్రకటించింది. మిగిలిన నాలుగు రాష్ట్రాలతో కలిపి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపును డిసెంబరు 3న చేపట్టనున్నట్లు తెలిపింది. ఈసీ షెడ్యూల్ ప్రకటించడంతో తెలంగాణలో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఖరారు చేసింది. తెలంగాణ అసెంబ్లీకి ఒకే విడతలో నవంబరు 30న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ సోమవారం ప్రకటించింది. మిగిలిన నాలుగు రాష్ట్రాలతో కలిపి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపును డిసెంబరు 3న చేపట్టనున్నట్లు తెలిపింది. ఈసీ షెడ్యూల్ ప్రకటించడంతో తెలంగాణలో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంపై మజ్లీస్ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. తెలంగాణలో మూడోసారి కేసీఆర్ సీఎం అవుతారని అన్నారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. తాము పోటీచేసే ప్రతి చోటా గెలుస్తామని ధీమా వ్యక్తంచేశారు. ఈ సారి రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎంఐఎం తొలిసారిగా పోటీ చేయనున్నట్లు ఒవైసీ ప్రకటించారు.



తెలంగాణలో ఓటర్ల వివరాలు ఇలా..

పోలింగ్ కేంద్రాలు ఎన్నిఅంటే..

టీ మీడియా, అక్టోబర్ 9,హైదరాబాద్ :

ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్రంలో నవంబర్ 30న పోలింగ్ జరగనుండగా, రాజస్థాన్ లో నవంబర్ 23న అదేవిధంగా మధ్యప్రదేశ్, మిజోరాంలో నవంబర్ 7న పోలింగ్ జరగనుంది. చత్తీస్ గఢ్ లో రెండు విడతల్లో నవంబర్ 7, 17 తేదీల్లో ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఐదు రాష్ట్రాల్లో డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. నోటిఫికేషన్ విడుదల సందర్భంగా సీఈసీ చీఫ్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ కోసం ఆరు నెలలుగా కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. 40 రోజుల్లో ఐదు రాష్ట్రాల్లో పర్యటించామని, వీటిల్లో 16.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

ఓటర్ల వివరాలు ఇలా..

తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 3.17 కోట్ల ఓటర్లున్నారని సీఈసీ చీఫ్ రాజీవ్ కుమార్ తెలిపారు. వీరిలో పురుషులు 1.58 కోట్లు మంది కాగా, స్త్రీ ఓటర్లు 1.58 కోట్లు మంది. 18-19 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన కొత్త ఓట్లు 8.11 లక్షల మంది ఉన్నట్లు సీఈసీ చీఫ్ తెలిపారు. దివ్యాంగులు 5.06 లక్షలు మంది, 80ఏళ్లు వయస్సు పైబడిన వారు 4.4లక్షలు మంది ఉన్నారు. వందేళ్లు వయసు దాటిన ఓటర్లు 7005 మంది ఉన్నారు.తెలంగాణ రాష్ట్రంలో 35,356 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఈసీ తెలిపింది. ఇందులో వెబ్ కాస్టింగ్ ఉండే కేంద్రాలు 27,798. అదేవిధంగా మహిళా పోలింగ్ కేంద్రాలు 597. మోడల్ పోలింగ్ కేంద్రాలు 644. దివ్యాంగ కేంద్రాలు 120 ఏర్పాటు చేయనున్నట్లు ఈసీ తెలిపింది. మొత్తం 148 చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు ఈసీ తెలిపింది.

సెక్యూరిటీ గార్డు పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- నిరసన తెలిపిన ఆర్జీ వన్ సెక్యూరిటీ సిబ్బంది

టీ మీడియా, అక్టోబర్ 9, గోదావరిఖని :

సింగరేణి ఆర్జీ త్రీ సెక్యూరిటీ గార్డు నాగయ్య పై జరిగిన దాడిని ఖండిస్తూ సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని సెక్యూరిటీ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపడం జరిగింది.సోమవారం ఏఐటీయూసీ ఆద్వర్యంలో ఆర్జీ వన్ జి.ఎం.ఆఫీస్ పరేడ్ గ్రౌండ్లో జరిగిన సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్,కేంద్ర కార్యదర్శి కే.స్వామి,బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోశం లు పాల్గొని మాట్లాడుతూ ఆర్జీ 3 లో ఈ నెల ఏడున రెండవ షిఫ్ట్ లో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డ్ నాగయ్య పై లద్నాపూర్ గ్రామ సర్పంచ్ భర్త బడికిల శ్రీనివాస్,అతని అనుచరులు కలిసి చేసిన దాడిని ఖండిస్తూ వారి పైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని మరియు ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.అధికార పార్టీ అహంకారంతో దురుసుగా ప్రవర్తించి సింగరేణి సెక్యూరిటీ గార్డ్ యొక్క పనికి భంగం కలిగించి పైగా అనుచరులతో కలిసి దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. అతనిపై క్రిమినల్ చర్య తీసుకోవాలని పోలీస్ కేస్ విధించాలని కోరుతున్నామని వారు పేర్కొన్నారు. గతంలో కూడా టిఆర్ఎస్ పేరుమీద టీబీజీకేస్ నాయకులమని సింగరేణి సిబ్బంది పైన ఈ విధంగా ప్రవర్తించడం వారికి అలవాటైపోయిందని, దాడుల కు పాల్పడిన వారిపై యాజమాన్యం, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇలాంటివి పునరావతం మవుతున్నాయని వారు ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి ఇలాంటి చర్యలు పునరావతం కాకుండా ఉండడానికి ఆర్.జి. త్రీ అధికారులు తప్పనిసరిగా అధికార పార్టీకి గాని టీబీజీకేస్ నాయకులకు గాని లోబడి లొంగిపోకుండా ఉండి సెక్యూరిటీ గార్డుల యొక్క ఆత్మస్థైర్యం నింపడానికి, ధైర్యాన్ని కలిగించడానికి కషి చేయాలని వారు యాజమాన్యంను కోరారు.ఏఐటియుసి పక్షాన బాధితులకు అండగా ఉండి న్యాయం కోసం పోరాడుతామని వారు తెలిపారు. మన తెలంగాణలో మన సింగరేణిలో సెక్యూరిటీ గార్డ్స్ కే సెక్యూరిటీ లేకపోవడం యాజమాన్యం యొక్క వైఫల్యంగా భావిస్తున్నామని వారు పేర్కొన్నారు. నిరాయుదులైనటువంటి సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది భూ కబ్జాలు జరిగినప్పుడు, భూనిర్వాసితుల సమస్య వచ్చినప్పుడు లేదా బొగ్గు,స్క్రాప్ దొంగతనానికి గురైనప్పుడు ప్రాణాలకు తెగించి సింగరేణి ఆస్తులు కాపాడటం అభినందనీయమైనప్పటికీ వారికి తగిన రక్షణ కల్పించవలసిన బాధ్యత సింగరేణి యాజమాన్యందేనని వారు తెలియజేశారు. ఆర్జీ వన్ ఎస్ అండ్ పి.సి ఏఐటీయూసీ డిపార్ట్మెంట్ సెక్రెటరీ ఆర్.వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు బోయిన స్వామి,నిచ్చకొల శ్రీనివాస్,గుంటి శ్రీకాంత్,అర్కటి నరేష్, కే.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జనాల ఇళ్లల్లో వెలుగు నింపడానికి చీకటి సూర్యుల కష్టాలు

టి మీడియా, అక్టోబర్ 9, ఓదెల :

పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం పోత్కపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల జీలకుంట, పోత్కపల్లి, కోమిరే, శానగొండ, రూపునారాయణపేట, గ్రామాలకు, జూనియర్ లైన్మెన్ లు గా పనిచేస్తున్న, దినేష్, నవీన్, అరుణ్, సబ్ స్టేషన్ పరిధిలో, విద్యుత్ సమస్య ఎక్కడ ఉన్నా, ఫోన్ చేసిన గంటలో పరిష్కారం చేసి, తిరిగి విద్యుత్ సరఫరా కొనసాగేలా కృషి చేస్తున్న వీరిని గ్రామస్తులు అభినందిస్తున్నారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న కొమ్ములు నరకడానికి, కూలీలు ఎవరు రాకపోవడంతో వారే కూలిగా మారి, వారి వృత్తిలో భాగంగా పోత్కపల్లి శివాలయం, ఆవరణంలో విద్యుత్ వైర్ తెగిపోవడంతో, సమస్య తెలియజేసిన, వెంటనే వచ్చి, చెట్టుకొమ్మలు తొలగించడంతోపాటు, వైర్లను జోడించి తిరిగి విద్యుత్ సరఫరాను కొనసాగించారు, ఇదేవిధంగా గ్రామాలలో రైతులకు, వీరి సేవలు రాత్రి పగలు తేడా లేకుండా సమస్య ఏ సమయంలో వచ్చిన, వీరి ప్రయాణం, నిరంతరం విద్యుత్ జనాలకు అందుబాటులో ఉండే విదంగా తోడ్పడుతున్నారు. వీరి సేవలను పలువురు కొనియాడుతున్నారు, వీరి యొక్క సమయస్ఫూర్తి, వీరి తీసుకున్న నెలసరి జీతంతో పై కాకుండా, వృత్తి పై మక్కువతో చేయడం సంతోషకరమని, అభినందిస్తున్నారు.

ఏసీబీకి చిక్కిన ముగ్గురు మునిసిపల్ ఉద్యోగులు

టి మీడియా, అక్టోబర్ 9,ఆదోని:

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటుండగా ముగ్గురు మున్సిపల్ సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు.. ఏసీబీ డీఎస్పీ డి.ఎస్.పి వెంకటాద్రి వెల్లడించిన మెరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదోని మున్సిపల్ కార్యాలయం పై ఏసిబి అధికారుల బందం దాడులు నిర్వహించింది. ఓ వ్యక్తి నుంచి రూ. 10 వేలు లంచం తీసుకుంటుండగా మున్సిపల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు మహాలక్ష్మి, చరణ్ లను అదుపులోకి తీసుకొన్నారు.వారి వద్ద నుండి లంచం తీసుకున్న 10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆదోని పట్టణంలోని మున్సిపల్ స్కూల్లో టీచర్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు ఇటీవలనే సస్పెండ్ అయ్యారు. నాన్ డ్రయల్ సర్టిఫికెట్ కోసం మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు చరణ్, మహాలక్ష్మి లు రూ .30 వేలు డిమాండ్ చేసినట్లు శ్రీనివాసులు తమను సంప్రదించారన్నారు.పథకం ప్రకారం మొదటి విడతగా రూ.5వేలు ఇవ్వగా, సోమవారం మరో రూ 10 వేలు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్గాఅదుపులోకితీసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు తెలిపామన్నారు.

బహుజన రాజ్య దార్శనికుడు కాన్షిరాం

టీ మీడియా, అక్టోబర్ 9,ఖమ్మం :

బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి , వారి సంక్షేమానికి , వారి సాధికారతకు బహుజన రాజ్యమే అంతిమ పరిష్కారమని గ్రహించి , తన జీవిత కాలంలోనే దానిని సార్థకత చేసుకున్న దార్శనీకుడు మాన్య శ్రీ కాన్షిరామ్ అని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ , ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ షేక్. నజీమా కొనియాడారు . సోమవారం ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా కార్యాలయంలో ఐక్యవేదిక కో - కన్వీనర్ ఉపేంద్ర బాయి అధ్యక్షతన జరిగిన కాన్షిరాం వర్ధంతి కార్యక్రమంలో వారు మాట్లాడారు . అణగారిన వర్గాల అభివృద్ధి కోసం పరితపించి , తన చివరి శ్వాస వరకు కృషి చేశారని వివరించారు . ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ ఉపాధ్యక్షుడు జంపా నాయక్ , కార్యదర్శి కోటేష్ నాయక్ , ఐక్యవేదిక కో - కన్వీనర్లు అబ్దుల్ రెహమాన్ , జంగిపల్లి రవి , ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు సురభి నాయక్ , వెంకటేష్ నాయక్ , మదన్ నాయక్ ,పాల్గొన్నారు

బతుకమ్మ చీరలు

కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేత

టీ మీడియా, అక్టోబర్ 9, ఆళ్ళపల్లి :

మండల కేంద్రంలోని రైతు వేదికలో స్థానిక తహసీల్దార్ లంకపల్లి వీరభద్రం అధ్యక్షతన ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి ఆళ్ళపల్లి మండల ఆడపడుచులకు సోమవారం బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆళ్ళపల్లి మండల ప్రజలకు ముందస్తుగా దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కోరారు. మండలానికి రావాల్సిన వందశాతంలో బతుకమ్మ చీరలు ప్రస్తుతం 60% వచ్చాయని, మిగిలిన 40% చీరలు అతి త్వరలో వస్తాయని, రాగానే ప్రజలకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కల్యాణ లక్ష్మి పథకానికి దరఖాస్తు పెట్టుకున్న ఏడుగురు లబ్ది దారులకు (ఒక్కోటి రూ.1,00,116/-ల విలువ) ఏడు చెక్కులను ఎంపీపీ అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సీ.హెచ్.అనుష, ఆళ్ళపల్లి, మర్కోడు రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు సోయం రామయ్య, తాటి బుల్లిబాబు, వార్డు సభ్యులు మొహమ్మద్ ఖయ్యూం, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కసనబోయిన నరేష్, ప్రజలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి ఆర్థిక సహాయం

టీ మీడియా, అక్టోబర్ 9, దమ్మపేట :కు చెందిన సకినాల పవన్ కుమార్ స్థానిక వి.కె.డి.ఎస్ రాజు జూనియర్,డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి.ఈయన గత కొంత కాలంగా ఊపిరితిత్తులు (లంగ్) క్యాన్సర్ తో భాద పడుతూ హైదరాబాద్ బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు.ఈ విషయం తెలుసుకొన్న ప్రస్తుత ఇంటర్,డిగ్రీ విద్యార్థుల తో పాటు అధ్యాపకుల బృందం ఎవరి వారు స్వీయ విరాళాలు ద్వారా సమకూరిన రూ. 28 వేల 585 లు ను పూర్వ విద్యార్థులు ఎస్.కె ఘనీ,పి.నరేంద్ర,కే.రవీంద్ర ల ద్వారా సోమవారం ఈ మొత్తం (%=o%.28,585/)ఆర్థిక సహాయాన్ని క్యాన్సర్ బాధిత విద్యార్థి తల్లిదండ్రులకు అంద చేసారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శేషుబాబు,సుబ్బయ్య, సత్యానంద్ పాల్గొన్నారు.